సాక్షి విశాఖపట్నం

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌నకు సాగర్‌నగర్ క్రీడాకారులు 8లో



యుద్ధవిద్యలు ఆత్మరక్షణకు ఆయుధాలు 8లో



పచ్చని భీమిలి లక్ష్యంగా.. 8లో

సింహగిరిపై నేడు శ్రీకృష్ణ జయంతి




సింహాచలం : సింహగిరిపై సోమవారం శ్రీకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6గంటల నుంచి ఆరాధన, దేవకీ అమ్మవారికి బేడామండపంలో తిరువీధి, శ్రీకృష్ణ ఆవిర్భావ ఘట్టం, బాల కృష్ణుడికి బేడా తిరువీధి, ఆస్థానమండపంలో అప్పన్న ఉత్స మూర్తుల చెంతన బాలకృష్ణుడికి విశేష పూజలు, భాగవత పురాణం, శ్రీకృష్ణ ఆవిర్భా విన్నపం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 6గంటల వరకే దర్శనాలు లభిస్తాయని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 11.30 నుంచి 12.15 కూడా సమయంలో కూడా దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా పీజీఆర్‌ఎస్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. అర్జీదారులు తమ సమస్యలతో పాటు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన రసీదులను తీసుకు రావాలని కలెక్టర్ సూచించారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తామంటే ఎలా?



ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం, ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి పత్రికల స్వేచ్ఛను పోలీసు కేసులతో ప్రభుత్వం హరిస్తామంటే ఎలా..? ఇటీవల సాక్షిలో ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడిన ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే.. సంబంధిత జర్నలిస్టుపై, ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. ప్రజల గొంతుకగా నిలిచే మీడియా గొంతును నులిమే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోంది. అక్షరాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను నోటీసులు, అక్రమ కేసులతో పోలీసులు నిరోధించలేరు. మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షిపై వేధింపుల ధోరణికే పాల్పడుతోంది. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. పత్రికలపై కక్ష కట్టిన ఏ నాయకుడూ బాగుపడిన దాఖలా చరిత్రలో లేదు.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ మాజీ విప్



రాజ్యాంగాన్ని గౌరవించడం లేదు



ప్రపంచంలోనే అత్యంత దృఢమైనదని భారత రాజ్యాంగానికి పేరు. అలాంటి రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించడం లేదు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా ఉండడానికే మీడియాను అణగదొక్కుతున్నారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేస్తున్నారు. ఒక రాజకీయ నాయకుడి ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే కేసు ఎలా నమోదు చేస్తారు? ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే. రాజకీయ పార్టీల నాయకులు ప్రెస్‌మీట్‌ల ద్వారా వెల్లడించిన అంశాలను వార్తగా మలిచే హక్కు జర్నలిస్టులకు ఉంటుంది. నాయకులు మీడియా సమావేశాలు పెట్టి అనేక అంశాలు మాట్లాడతారు. వాటిని వార్త రూపంలో ప్రజలకు చేరవేయడంతో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. అంతమాత్రాన వార్త రాసిన జర్నలిస్టుపై, పత్రిక ఎడిటర్‌పై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేయడం సరికాదు.

– తైనాల విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే

ఓనం..ఆనందం





విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన విశాఖలో కేరళ సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. తమ సంప్రదాయాలను భావితరాలకు అందించే లక్ష్యంతో, కేరళీయులు ఆదివారం బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళాసమితిలో ఓనం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. **ఈ వేడుకలు కేరళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ అందరినీ ఆకట్టుకున్నాయి.** 8లో

నృత్య వైభవం



విశాఖలో మూడు రోజుల పాటు జరిగిన 17వ వైశాఖి జాతీయ నృత్యోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. కళాభారతి ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ వేడుకలు, దేశవ్యాప్తంగా వచ్చిన కళాకారుల అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. 8లో

పెందుర్తిలో కూటమి సిగపట్లు

- పెత్తనం కోసం ఎమ్మెల్యే **వంచకర్ల..** టీడీపీ ఇన్‌చార్జి గండి **బాబ్జి పాట్లు**
- ఒకరిపై ఒకరు తమ **తమ అధిష్టానానికి** ఫిర్యాదులు
- మీడియా ముఖంగా **బహిర్గతం చేసిన** గండి బాబ్జి



'నేను పెందుర్తి ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేని. నా మీద టీడీపీ ఇన్‌చార్జిని వేసి అతనికీ అధికారాలు ఇస్తామంటే ఎలా. ప్రతీ అధికారిక సమావేశానికి ఇన్‌చార్జిలు వచ్చి పెత్తనం చేయడం ఏంటి. నియోజకవర్గంలో కూడా మాకు తెలియకుండా టీడీపీ నేతలు పనులు చేయించుకుంటున్నారు. పార్టీ ఇన్‌చార్జిలు అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం ఏంటి. ఇదేనా కూటమి పొత్తు ధర్మం' రెండు నెలల క్రితం వీఎంఆర్‌డీఏ వేదికగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేసిన వ్యాఖ్యల సారాంశం.

'నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కేడర్ అంతా కలిసి పనిచేస్తేనే కూటమి అభ్యర్థి గెలిచారు. వారికి ప్రజా సమస్యలపై ఎంత బాధ్యత ఉందో మాకూ అంతే బాధ్యత ఉంది. పేదలకు, దళితులకు అన్యాయం చేస్తూ అభివృద్ధి చేస్తామంటే మేం ఒప్పుకోం. పేదల పక్షాన నిలబడితే అభివృద్ధికి అడ్డుపడుతున్నామంటూ మాపై అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. కూటమిగా అధికారంలో ఉండి ఇలాంటి చర్యలకు కొందరు పాల్పడడం మా దౌర్భాగ్యం' సబ్బవరంలో మీడియా ముఖంగా టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి వాఖ్యలు ఇవి.

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో అధికార కూటమి నాయకులైన జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. ఇద్దరు నాయకులు బహిరంగంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు కలిసి హాజరవుతున్నప్పటికీ, లోపల మాత్రం వారి మధ్య విభేదాలు ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా నియోజకవర్గంలోని వివాదాస్పద పనుల విషయంలో ఇద్దరూ భిన్నమైన వైఖరి తీసుకుంటూ అధికారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని సమాచారం. తమ చెప్పుచేతల్లో అధికార యంత్రాంగాన్ని పెట్టుకోవడానికి ఇద్దరూ తీవ్రంగా పోటీ పడుతున్నారు. పంచకర్ల రమేష్ బాబు తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి సుప్రీం అని భావిస్తుండగా, గండి బాబ్జి ఎన్నికల్లో తన కృషికి ఫలితంగా విజయం దక్కిందని, ఎమ్మెల్యేతో సమానంగా గౌరవం కావాలని పట్టుబడుతున్నారు. రెండు నెలల క్రితం వీఎంఆర్‌డీఏ సమీక్షలో కూడా వారి మధ్య వివాదం తలెత్తినట్లు సమాచారం. తాజాగా, సబ్బవరంలో ఒక అభివృద్ధి పని విషయంలో ఇరువురి మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దీనిపై గండి బాబ్జి శనివారం మీడియా ముందు మాట్లాడుతూ, 'పేదల భూములు లాక్కొని అభివృద్ధి చేస్తారా? నేను బాధితుల తరఫున మాట్లాడితే, మా పొత్తులో ఉన్న వారే మా అధిష్టానానికి నాపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలాంటి దౌర్భాగ్యమైన స్థితిలో ఉన్నాం' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పెందుర్తి నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య సఖ్యత లేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

తొలి నుంచీ తలోదారే

పెందుర్తిలో జరుగుతున్న ప్రతీ అంశంలోనూ ఎమ్మెల్యే పంచకర్లకు, గండి బాబ్జీకి మధ్య సఖ్యత ఉండడం లేదన్నది బహిరంగ రహస్యమే. ఇటీవల కాలంలో వీరి మధ్య మరింత దూరం పెరిగింది. పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా పంచకర్ల సిఫార్సుతో జనసేన నాయకుడు అయిత సింహాచలంని (మిగతా 8లో)

విశాఖ అభివృద్ధికి ప్రాధాన్యం

సారథ్యం ముగింపు సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



నడ్డాని సత్కరిస్తున్న బీజేపీ ప్రజాప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : మహా విశాఖ నగర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. విశాఖ సమగ్రాభివృద్ధి కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన స్పష్టం చేశారు. నగరంలో జరిగిన సారథ్యం ముగింపు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.625 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతోందని, అలాగే విశాఖ రైల్వే జోన్ సిద్ధమైందని పేర్కొన్నారు. కోట్లాది మంది కార్యకర్తల కృషి వల్లే దేశాన్ని బీజేపీ అభివృద్ధి పథంలో నడిపించగలుగుతోందని ఆయన ప్రశంసించారు. 15 నెలల కాలంలో రాష్ట్ర అభివృద్ధి, పునర్వైభవం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి, అఖిల భారత నాయకత్వానికి దానిని గిఫ్ట్‌గా ఇవ్వాలని ఆయన కోరారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అనుమతులు వేగంగా మంజూరవుతున్నాయని తెలిపారు. అలాగే, అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రధాని మోదీ భారీ ప్యాకేజీలు ఇచ్చారని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఆర్థిక భారం ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజధాని అమరావతి వేగంగా రూపుదిద్దుకుంటోందని, అన్ని రంగాల్లోనూ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని ఆయన వివరించారు. ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురాంరాజు, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కామినేని శ్రీనివాస్, డా.పార్థసారథి, రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఈశ్వరరావు, ఎంపీలు సీఎం రమేష్, పీవీ సత్యనారాయణ, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాస్థలివద్ద ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్స్, పొందూరు ఖాదీ, ఏటికొప్పాక బొమ్మల స్టాళ్లను నడ్డా సందర్శించారు. సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు.

బీజేపీ పదాధికారులతో సమావేశం

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర పదాధికారులతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన ఆదివారం నగరంలోని ఓ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ బలోపేతానికి అవలంబించాల్సిన కార్యాచరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల కళకళ



వారాంతం కావడంతో విశాఖలోని పర్యాటక ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో ప్రధాన పర్యాటక కేంద్రాలైన ఆర్కే బీచ్, రుషికొండ, సాగర్ నగర్ సందర్శకులతో కళకళలాడాయి. సముద్ర తీరంలో సేద తీరడానికి, కుటుంబంతో గడపడానికి వచ్చిన పర్యాటకుల రాకతో ఈ ప్రాంతాలు జనసందోహంతో నిండిపోయాయి. రుషికొండ బీచ్ వద్ద పర్యాటకుల సందడి ఎక్కువగా కనిపించింది.

- ఫొటో :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'కోడి' నిబంధనలకు 'గండి'

- అధికారమనే జులుంతో కూటమి నేతలు
- కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత
- గండి బాబ్జి ఫోన్... విడిచిపెట్టిన అధికారులు!



ఆరిలోవలో పట్టుకున్న కోళ్ల వ్యర్థాల తరలింపు వాహనం

డాబాగార్డెన్స్: అధికార పార్టీకి చెందిన నాయకులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కోడి వ్యర్థాల సేకరణ, తరలింపుపై కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించినప్పటికీ, కొందరు నాయకులు, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ వ్యవహరిస్తున్నారు.

కౌన్సిల్‌లో నిర్ణయం ఇలా..

ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కోడి వ్యర్థాల సమస్యపై తీవ్ర చర్చ జరిగింది. కమిషనర్ గార్గ్ మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించడానికి జీవీఎంసీయే స్వయంగా కోడి వ్యర్థాలను సేకరించి, కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమిస్తుందని తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు.

ఆరిలోవలో పట్టుబడ్డ కోడి వ్యర్థాల వాహనం

ఆదివారం ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో కమిషనర్ నియమించిన ప్రత్యేక బృందం కోడి వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ఒక వాహనాన్ని పట్టుకుంది. ఈ విషయం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జికి చేరినట్లు సమాచారం. వెంటనే ఆయన అధికారులకు ఫోన్ చేసి, ఒత్తిడి తీసుకురావడంతో ఆ వాహనాన్ని వదిలేశారని పలువురు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లే గుసగుసలాడుకుంటున్నారు.

కొత్త కాంట్రాక్టులు, పాత దందా

కోడి వ్యర్థాల సేకరణకు సంబంధించి జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లకు 8 మంది కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. అయితే, కొందరు కూటమి నేతలు తమ సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుని కోడి వ్యర్థాలను సేకరిస్తున్నారని, వాటిని కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు కాకుండా చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై కార్పొరేటర్లు ఫొటోలతో సహా ఫిర్యాదు చేసినా, అధికారులు వాహనాలను పట్టుకుని మళ్లీ వదిలేయడం పరిపాటిగా మారిందని చెబుతున్నారు.

కీలకంగా కూటమి ఎమ్మెల్యేలు

ఈ వ్యవహారంలో కీలకమైన కూటమి ఎమ్మెల్యేలతో పాటు, తెర వెనుక ఉండి రౌడీషీటర్ల ద్వారా వ్యవహారం నడిపిస్తున్న జీవీఎంసీలోని కీలక నేత తీరుపైనా అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందాకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొన్న ఒక అధికారిని సిటీ వెటర్నరీ అధికారి పదవి నుంచి తొలగించడం కూడా ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

వాల్తేరు డివిజన్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష



ఆధునికీకరించిన సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగం పనులపై డీఆర్‌ఎం డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆధునీకరించిన సివిల్ ఇంజనీరింగ్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. రైల్వే భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రద్దీ సీజన్లలో వివిధ విభాగాల మధ్య సమన్వయం మెరుగుపరుచుకోవడం ద్వారా డివిజన్ పనితీరు మరింత మెరుగవుతుందని ఆయన తెలిపారు. సమీక్షలో భాగంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ పనులు, అమృత్ భారత్ స్టేషన్ పనులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలు, కొండచరియల ప్రాంతాలలో భద్రతా పనుల గురించి చర్చించారు.

సమావేశానికి ముందు డీఆర్‌ఎం ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు ఈ. శాంతారాం, మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కె. మహారాణా పాల్గొన్నారు.

మా పండగ భలే భౌగుంది





డాగ్..డాన్



ఫ్యాన్ లేకపోతే నేనుండలేను



వైట్ ఉందిలే బేబీ..



నా ఎత్తుకు ఎవరైనా చిత్తే...



మిల్కీబ్యూటీ



ఆదివారం మాకెంతో పండుగ రోజు. నగరంలో జరిగిన నేషనల్ డాగ్ షోలో మేము, అదరగొట్టేశాం. మాకెంత ఆనందంగా ఉందంటే... తోకలన్నీ ఒకేసారి ఊపితే సునామీ వచ్చేసేంత. దాదాపు 42 రకాల జాతుల నుంచి 250 మంది తోటి శునకాలు ఈ ప్రదర్శనకు వచ్చాయి. ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లోకి అడుగుపెట్టగానే, మా వాళ్లందరూ ఒకరినొకరు తోకలతో పలకరించుకోవడం, వాసన పీల్చుకోవడం, చిలిపిగా కరిచేసుకోవడం వంటివి జరిగాయి. పోటీ మొదలవగానే, మాలో ఉన్న బద్ధకం మాయమైపోయింది. జర్మన్ షెపర్డ్, రాట్‌విల్లర్ వంటి స్నేహితులు సీరియస్‌గా నిలబడ్డారు. గోల్డెన్ రిట్రీవర్, లాబ్రడార్ వంటివి తమ అందంతో, చిలిపి చేష్టలతో న్యాయమూర్తులను ఆకట్టుకోవడానికి ప్రయత్నించాయి. నేను మాత్రం నా తోకను నడుపుతూ, నా పెంపకందారుడి ఆదేశాలు పాటిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచాను. ఎంపిక ప్రక్రియ చాలా కఠినంగా ఉంది. మా రంగు, ముక్కు, పరిగెత్తే విధానం వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. మా యజమాని మాట వింటున్నామా, లేదా అని కూడా పరీక్షించారు. నిజంగా చెప్పాలంటే, మాలోని ఏ జాతి బెస్ట్ అని తేల్చడం న్యాయమూర్తులకు కూడా కష్టమైంది. అయినా చివరకు ఉత్తమ శునకాలను ఎంపిక చేశారు. మరో విశేషం ఏమిటంటే ఈసారి కేవలం పెద్ద శునకాలే కాదు, చిన్న పప్పీలు కూడా ఈ పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటాయి. వారిని చూసి మాకే ముచ్చటేసింది. ఈ విజయం తర్వాత, మా యజమానులు మమ్మల్ని పార్కుకు తీసుకువెళ్లి, మా ఫేవరెట్ బిస్కెట్లు, బర్గర్లు తినిపించారు. వచ్చే ఏడాది కూడా ఇలాగే మళ్లీ కలిసి, పాత స్నేహితులను కలుసుకుని, కొత్త స్నేహితులను చేసుకుంటాం. చివరగా ఓ మాట .. నేషనల్ డాగ్ షో-2025 పేరుతో విశాఖ కెన్నెన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిర్వాహకులు శ్రీకృష్ణ, నారాయణరెడ్డి, రాజేశ్వరరావు, సిరట్ల శ్రీనివాస్‌లకు మా తరుపున కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం. టాటా..భౌభౌ..

- ఎంవీపీకాలనీ

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఓనం.. ఆనందం

- విశాఖలో కేరళీయుల సాంస్కృతిక వైభవం
- అలరించిన కళా ప్రదర్శనలు


కేరళ యువతుల నాట్య ప్రదర్శన


నాట్యవిన్యాసంలో ప్రజలతో కలిసి పాల్గొన్న బలి చక్రవర్తి


వేడుకల్లో పాల్గొన్న కేరళీయులు

మురళీనగర్: విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన విశాఖపట్నంలో కేరళీయుల సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. తమ వారసత్వాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతో.. బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళాసమితిలో ఆదివారం ఓనం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్న కేరళీయులు నిర్వహించిన ఈ వేడుకలు కేరళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టాయి. ముందుగా తమ ఆరాధ్య దైవమైన బలి చక్రవర్తికి స్వాగతం పలికే కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాల నడుమ మహిళలు దీపాలతో, ఛత్రంతో బలి చక్రవర్తిని వేదిక పైకి ఆహ్వానించారు. ఆయన రాకతో సభాప్రాంగణం మొత్తం లేచి నిలబడి గౌరవాన్ని ప్రకటించింది. అనంతరం బలి చక్రవర్తి ప్రజలందరినీ ఆశీర్వదించి, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముందు, మహిళలు పూలతో అందంగా అలంకరించిన 'ఓనపూక్కళం'వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రదక్షిణలు చేశారు. అనంతరం కేరళ ఎంపీ బెన్ని బెహనన్, ఎమ్మెల్యే ఎం.ఎస్. అరుణ్ కుమార్, ఇతర పెద్దలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన 'తిరువాదిరకళి' నృత్యం, శాస్త్రీయ నృత్యమైన 'మోహినియాట్టం', పులివేషాలు, చెండమేళం వాయిద్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేరళ ఎంపీ బెన్ని బెహనన్ మాట్లాడుతూ.. ఎక్కడ ఉన్నా స్థానిక ప్రజలతో కలిసిపోతూ తమ సంస్కృతిని కాపాడుకోవడం కేరళీయుల ప్రత్యేకత అని అన్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మావిలెక్కిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎం.ఎస్. అరుణ్ కుమార్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలు కేరళీయులకు ఓనం శుభాకాంక్షలు తెలిపి, తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. నగరం నలుమూలల నుంచి సుమారు 1,500 మంది కేరళీయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు. చివరగా 29 రకాల పదార్థాలతో తయారు చేసిన కేరళీయుల ప్రత్యేక విందు భోజనం 'సాద్య'ను సామూహికంగా ఆరగించారు. కార్యక్రమంలో కేరళ కళాసమితి అధ్యక్షుడు జె.థామస్, జనరల్ సెక్రటరీ హరిదాస్, కైరళీ ఆర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్ శశిధరణ్ పిళ్ళై, వీఎండబ్ల్యూఏ అధ్యక్షుడు కేపీ వర్గీస్, కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత నందినీ మేనన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని భీమిలి లక్ష్యంగా..

డ్రోన్లతో విత్తనాలు చల్లిన 'మిషన్ గ్రీన్ భీమిలి'



కొండపై డ్రోన్ ద్వారా చల్లుతున్న విత్తనాలు

భీమునిపట్నం: మిషన్ గ్రీన్ భీమిలి సంస్థ ఆధ్వర్యంలో భీమిలిలోని నరసింహస్వామి కొండ ప్రాంతాల్లో డ్రోన్‌ల సాయంతో ఆదివారం విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ఆదిత్య, గుల్లల వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు వివిధ రకాల విత్తనాలను, విత్తన బంతులను కొండపై చల్లినట్లు తెలిపారు. వాటిలో చాలావరకు పెరిగి పెద్దవయ్యాయని, మరింత పచ్చదనం పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా సుమారు మూడు కోట్ల విత్తన బంతులు, మూడు వందల కిలోల విత్తనాలను డ్రోన్‌ల సాయంతో కొండ చుట్టూ చల్లినట్లు వివరించారు. వీలైనంత ఎక్కువ మొక్కలను పెంచాలన్నదే తమ సంస్థ లక్ష్యమని, దీని వల్ల పర్యావరణం మెరుగుపడటంతో పాటు, వర్షాలు కూడా అధికంగా కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పలువురు సహకరించారని, భవిష్యత్తులో మరింత ఎక్కువ విత్తనాలను చల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) అధ్యక్షుడు కాళ్ల సన్ని, హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, సభ్యులు పాల్గొని తమ సహాయ సహకారాలు అందించారు.

భావోద్వేగభరితంగా 'చండాలిక'

ముగిసిన 17వ వైశాఖి నృత్యోత్సవాలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి సుదగాని రవిశంకర్





మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న 17వ వైశాఖి జాతీయ నృత్యోత్సవాలు ఆదివారంతో అంగరంగ వైభవంగా ముగిశాయి. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఐసీసీఆర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ వేడుకలు జరిగాయి. ముగింపు రోజున పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

కళ్లకు కట్టిన చండాలిక కథ

పశ్చిమ బెంగాల్‌కు చెందిన అంగ్సుమాన్ గుప్తా బృందం రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'చండాలిక' కథను అద్భుతంగా ప్రదర్శించింది. క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో అంటరానితనానికి గురైన ఒక యువతి కథను కథాకళి, మణిపురి, జానపద నృత్యరీతులతో కళ్లకు కట్టారు. ఆమె పుట్టుక, ఎదుగుదల, సమాజం నుంచి ఎదురైన బహిష్కరణ వంటి ఘట్టాలను భావోద్వేగభరితంగా పండించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. అనంతరం కర్ణాటకకు చెందిన సుజయ్ శాన్‌బాగ్ బృందం 'దుర్గా సప్తశతి' ఆధారంగా రూపొందించిన భరతనాట్య రూపకాన్ని ప్రదర్శించింది. భారతీయ సంస్కృతి, సరస్వతీ నది ఒడ్డున ధర్మం వికసించిందని, లోకంలో ధర్మానికి హాని కలిగినప్పుడు శక్తి స్వరూపిణి అయిన దుర్గా మాత అవతారాలతో దాన్ని ఎలా పునరుద్ధరిస్తుందో వివరిస్తూ వారు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. తొలుత ఉత్సవ గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి సుదగాని రవిశంకర్ నారాయణ్, ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి నృత్యాలు గొప్ప చిహ్నాలని, కళాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు బత్తిన విక్రమ్ గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫెస్టివల్ డైరెక్టర్లు సాయి వెంకటేష్(కర్ణాటక), కాశ్మీర త్రివేది(మహారాష్ట్ర), డా.సజని వల్లభనేని, ఎం.భారతి(తెలంగాణ), జగబంధు జెనా(ఒడిశా), అనుపమ మోహన్(కేరళ) పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను, ఉత్సవ నిర్వాహకులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఆటో బోల్తా పడి యువకుడి దుర్మరణం


జగదీష్(ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ వేమగొట్టిపాలెం శివారులో ఆదివారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భీమిలి జోన్ రెండో వార్డు రాజలింగంపేట గ్రామానికి చెందిన బోర జగదీష్ (25) దుర్మరణం చెందాడు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాలివి. రాజలింగంపేటకు చెందిన ఆరుగురు యువకులు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం ధారలోవ అమ్మవారి గుడికి వెళ్లి భీమిలి తిరిగి వస్తున్నారు. వేమగొట్టిపాలెం శివారులో రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా వారిని చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. అయితే గాయపడిన జగదీష్ చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మరొక యువకుడికి కాలు విరిగిపోయింది. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జగదీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జగదీష్ మృతితో రాజలింగంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూటమి సిగపట్లు

(7వ పేజీ తరువాయి)

నియమించారు. నెల రోజుల క్రితం జరిగిన చైర్మన్ ప్రమాణ స్వీకారానికి కూటమిలోనే ఉన్న గండి బాబ్జి ముఖం చాటేశారు. అతనితో పాటు టీడీపీ నాయకులెవరూ ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. చివరకు పీఏసీఎస్ సభ్యుడిగా నియమితులైన చిరికి అవతారం కూడా కార్యక్రామనికి హాజరు కాలేదు(తరువాత పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యత స్వీకరించారు). ఈ క్రమంలో పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ లేఖతో అతని అనుచరుడు అవగడ్డ అప్పలనాయుడు భార్య జ్యోతిని నియమించారు. అయితే జ్యోతి ప్రమాణ స్వీకారం చేస్తున్న సభకు కేవలం కిలో మీటర్ దూరం వరకు వచ్చిన పంచకర్ల రమేష్‌బాబు సహా జనసేన కేడర్ అంతా వెనుదిరిగారు. ఇక పంచకర్ల అనుచరులు చింతగట్లలో ఐదెకరాల భూమిపై కన్నేసి తప్పుడు పత్రాలు సృష్టిస్తే దాన్ని గంబి బాబ్జీ వర్గీయులు అడ్డుకున్నట్లు బహిరంగంగానే చర్చ జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే తాజాగా నియోజవర్గంలో పరిణామాల బట్టి పంచకర్ల రమేష్‌బాబు, గండి బాబ్జి పోరు తారాస్థాయికి చేరుకున్నట్టే కనిపిస్తుంది.

ఆధిపత్య పోరు

పెందుర్తి నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి మధ్య ఎన్నికల నుంచే కొనసాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు అధికారులకి పెద్ద తలనొప్పిగా మారింది. వీరిద్దరూ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కలిసి పనిచేశారు తప్ప, వారి మధ్య విభేదాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

అధికారుల బదిలీలు, ఒత్తిళ్లు

అధికారం చేపట్టిన వెంటనే అధికారుల బదిలీల విషయంలోనే ఈ ఇద్దరు నాయకుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. పంచకర్లకు పోటీగా గండి బాబ్జి కూడా తన సిఫార్సులను అధికారులకు పంపారు. బాబ్జికి జిల్లా.. రాష్ట్రస్థాయి నాయకులతో ఉన్న పరిచయాల కారణంగా ఆయన సిఫార్సులకు ప్రాధాన్యత లభించడం, పంచకర్ల సిఫార్సులు కొన్నిసార్లు అమలు కాకపోవడం ఆయన అసహనానికి కారణమైంది. అంతేకాకుండా, ఎమ్మెల్యేకు పోటీగా బాబ్జి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం, పీజీఆర్ఎస్ కార్యక్రమాలు చేపట్టడం, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం వంటివి కూడా పంచకర్లకు మరింత కోపం తెప్పించాయి. ఈ కోపాన్ని ఇద్దరు నాయకులు అధికారులపై చూపుతున్నారు. ఒకే పని విషయంలో ఒకరు 'వద్దు' అంటే, మరొకరు 'చేయాలి' అని తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తుండటంతో అధికారులు ఎవరి మాట వినాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు.

ప్రజలకు మేలు చేసేదెవరు?

ఈ ఆధిపత్య పోరులో ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ 15 నెలల కాలంలో ఇద్దరు నేతలు తమ తమ పార్టీల నాయకులకు, కార్యకర్తల కోసం మాత్రమే పనిచేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, కేవలం తమ కార్యకర్తలకు మేలు చేయడానికి, వారు కేసుల్లో ఇరుక్కుంటే కాపాడడానికి, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడానికి మాత్రమే ఈ నేతలు ఉత్సాహం చూపిస్తున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఈ నేతల వేధింపులు తాళలేక చాలా మంది అధికారులు బదిలీలపై వెళ్లిపోయారని కూడా ఆరోపణలు ఉన్నాయి. తమకు నచ్చని అధికారులను వేధించి బదిలీ చేయించడం కోసం మాత్రమే ఈ నేతలు అధికారాన్ని పంచుకుంటున్నారని పెందుర్తి ప్రజలు మండిపడుతున్నారు.

యుద్ధవిద్యలు ఆత్మరక్షణకు ఆయుధాలు

సీపీ శంఖబ్రత బాగ్చి

పీఎంపాలెం: యుద్ధవిద్యలను నేర్చుకోవడం వల్ల ప్రతికూల పరిస్థితుల్లో అవి ఆత్మరక్షణకు పదునైన ఆయుధాల్లా ఉపయోగపడతాయని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. శిల్పారామంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సీపీ.. మార్షల్ ఆర్ట్స్ శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. విద్యార్థి దశలోనే యుద్ధ కళలు నేర్చుకుంటే భవిష్యత్తులో ప్రయోజనకారులుగా మారగలరన్నారు. శరీర బరువు ప్రామాణికంగా నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు సీపీ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల నిర్వాహక కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర తైక్వాండో సంఘం కార్యదర్శి బాబూరావు, మాలతాంబ విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతి, కార్తీక్ పైడి, స్థానిక నాయకుడు వంకాయల మారుతీ ప్రసాద్, వాకర్స్ 20–20 అధ్యక్షుడు శేఖర్ బాబ్జీ, బంగారు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌కు సాగర్‌నగర్ క్రీడాకారులు

కొమ్మాది: సాగర్‌నగర్ బాస్కెట్‌బాల్ అకాడమీకి చెందిన ఐదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి కోచింగ్ క్యాంప్‌నకు ఎంపిక య్యారు. మే 15 నుంచి 18 వరకు చిత్తూరులో జరిగిన 10వ సబ్ జూనియర్స్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో వీరు ప్రతిభ కనబరిచారు. అకాడమీ కోచ్ ఆర్. సునీల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, బాలుర విభాగం నుంచి వాట్సన్, నీల్, కృష్ణ, బాలికల విభాగం నుంచి ఎస్. నవ్య, జి. వైభవి ఈ నెల 16 నుంచి చిత్తూరులో జరగనున్న సబ్ జూనియర్స్ నేషనల్ బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంపులో పాల్గొననున్నారు. ఈ క్యాంపులో ప్రతిభ చూపించిన క్రీడాకారులు అక్టోబర్ 4 నుంచి 10 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే సబ్ జూనియర్స్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ సునీల్ రెడ్డి తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి నృత్య పోటీలు


విజేతలతో నిర్వాహకులు

మద్దిలపాలెం: ఎంఎంటీసీ కాలనీలోని ఏపీఎస్ఈబీ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి నృత్య పోటీలు ఆదివారం ముగిశాయి. భారతీయ శాస్త్రీయ, సంస్కృతి, సంప్రదాయ, జానపద నృత్యాలతో దాదాపు 300 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను, న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. ఈ పోటీలను స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించాయి. విజేతలుగా నిలిచిన కళాకారులకు వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టీ కమల్ బేడి, ఏపీఎస్ఈబీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కె.రామారావు, బ్రహ్మకుమారి రామేశ్వరి బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్, డాక్టర్ విజయవేణి వ్యవహరించారు.

విశాఖ మార్కెట్‌లోకి కొత్త కేటీఎం డ్యూక్ 160 బైక్


కేటీఎం డ్యూక్ 160 బైక్‌ను ఆవిష్కరిస్తున్న వరుణ్ సంస్థల చైర్మన్ ప్రభు కిశోర్

ఏయూ క్యాంపస్: కేటీఎం డ్యూక్ 160 బైక్ విశాఖ మార్కెట్‌లోకి విడుదలైంది. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఈ బైక్‌ను నగర ప్రజలకు పరిచయం చేశారు. వరుణ్ సంస్థల చైర్మన్ ప్రభు కిశోర్, సౌత్ సేల్స్ సర్కిల్ హెడ్ కార్తీక్ కలిసి ఈ కొత్త బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభు కిశోర్ మాట్లాడుతూ ఫ్యాషన్, పర్ఫార్మెన్స్, పవర్ ఈ మూడింటి కలయికగా ఈ బైక్ నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కేటీఎం గ్లోబల్ బ్రాండ్ డిస్‌ప్లే, లైవ్ రాక్ బ్యాండ్ ప్రదర్శనతో పాటు అవార్డుల ప్రదానోత్సవం కూడా జరిగింది

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

సింహాచలం: అడవివరం గోశాల జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్‌పై ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాటిని నడుపుతున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాలివి. గోపాలపట్నం నుంచి అడవివరం వైపు స్కూటీపై వెళ్తున్న వ్యక్తి, అడవివరం నుంచి గోపాలపట్నం వైపు పల్సర్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గోశాల జంక్షన్ వద్ద ఒకరినొకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పల్సర్ బైక్ నడుపుతున్న వ్యక్తి చేయి విరగగా, స్కూటీపై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా.. గోశాల నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ జరిగిన తర్వాత ఈ జంక్షన్ వద్ద ప్రమాదాలు పెరిగాయి. ఇక్కడ డివైడర్లు, స్టాపర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నాయి. ఏ వాహనం ఎటువైపు వెళ్తుందో తెలియక వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని సరిదిద్దాలని ట్రాఫిక్ పోలీసులను స్థానికులు కోరుతున్నారు.

ఉల్లి వ్యాపారిపై హత్యాయత్నం

ఆలస్యంగా వెలుగులోకి ఘటన


సంతోష్ తలపై గాయం (ఫైల్)

కూర్మన్నపాలెం: ఉల్లిపాయల వ్యాపారిపై హత్యాయత్నం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ గోప్యంగా ఉంచారు. నిందితుడిపై రెండు వారాలు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. బానోజీకాలనీకి చెందిన కొర్ల సంతోష్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆగస్టు 31న దువ్వాడ బ్రిడ్జి వద్ద ఆటోలో ఉల్లిపాయలు విక్రయిస్తుండగా.. 86వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన మేడిశెట్టి శ్రీను అతనితో కావాలని గొడవకు పాల్పడ్డాడు. అనంతరం అతను తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో సంతోష్ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో వ్యాపారి తలకు తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగింది. దాడిలో స్థానికుడు ప్రకాశ్ కూడా శ్రీనుకు సహకరించినట్లు తెలుస్తోంది. గాయపడిన సంతోష్‌ను సహవ్యాపారులు వెంటనే అగనంపూడి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల తక్షణ చర్యతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తనను చంపాలన్న దురుద్దేశంతోనే శ్రీను దాడికి పాల్పడ్డాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దువ్వాడ పోలీసులు శ్రీనుపై అదే రోజున కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించారు. అయినప్పటికీ కేసును గోప్యంగా ఉంచడం, నిందితుడిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అనుమానాలను కలిగిస్తోంది. ఈ ఘటనపై సమాచార హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ కొమర కృష్ణకుమార్ మాట్లాడుతూ నిందితుడిపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ధర్నా చేస్తామన్నారు.

మూట్ కోర్టు పోటీల విజేత బెంగళూరు


విజేతలకు నమూనా చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

పీఎంపాలెం: జీవీఎంసీ 8వ వార్డులోని ఎస్‌వీపీ లా కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఆళ్వార్ నేషనల్ మూట్ కోర్ట్–25 పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ పోటీల్లో దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన 30 లా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతగా నిలిచిన బెంగళూరు బీఎంఎస్ లా కళాశాల జట్టు రూ.40 వేల నగదు బహుమతిని గెలుచుకుంది. రన్నరప్‌గా నిలిచిన హైదరాబాద్ ఐసీఎఫ్ఏఐ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతి లభించింది. ఉత్తమ వక్తగా కోయంబత్తూరు ప్రభుత్వ లా కళాశాల విద్యార్థిని ఎస్.మంజరి రూ.10 వేలు, ఉత్తమ పరిశోధకురాలిగా పంజాబ్ లా విద్యార్థి శ్రేష్ఠ రూ.10 వేలు, ఉత్తమ ప్లీడింగ్స్ అండ్ మెమోరియల్స్‌గా క్రైస్ట్ యూనివర్సిటీ విద్యార్థి రూ.10వేలు నగదు బహుమతులను అందుకున్నారు. ముగింపు కార్యక్రమంలో ఏయూ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వి. కృష్ణ మోహన్, సీనియర్ న్యాయవాది వి.రవీంద్ర ప్రసాద్, ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు జి.రామారావు, లా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, చైర్మన్ డాక్టర్ సుంకరి రవీంద్ర, అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా మాణిక్యం, లా కళాశాల ప్రిన్సిపాల్ అలక్ చంద్రుడు, ఇతర న్యాయవాదులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

'రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడికే పూర్తి అధికారాలు'

తగరపువలస: ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ సంఘం నిబంధనల ప్రకారం, ప్రస్తుత రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డికే పూర్తి అధికారాలు ఉంటాయని జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి జీరు సత్యవర ప్రసాదరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చిట్టివలసలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి వై.శ్రీకాంత్‌ల మధ్య ప్రస్తుతం హైకోర్టులో వివాదం నడుస్తోందని తెలిపారు. ఈ ఏడాది మే 31న జరిగిన ఎన్నికల ప్రకారం, కార్యవర్గం కాల పరిమితి 2027 మే 30 వరకు కొనసాగుతుందన్నారు. ఈ వివాదంపై జూలై 18న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ.. జి.వెంకటరెడ్డి కబడ్డీ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతారని పేర్కొందన్నారు. తుది తీర్పు వెలువడే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఈ నెల 4న కోర్టు మరోసారి ధ్రువీకరించిందన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం, పాత 13 జిల్లాల కబడ్డీ సంఘాల సభ్యులనే పరిగణనలోకి తీసుకుందన్నారు. అధ్యక్షుని అనుమతి లేకుండా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ ఈ నెల 22 నుంచి 26 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో 51వ రాష్ట్ర జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారని ప్రసాదరెడ్డి తెలిపారు. విజయవాడ ఉత్సవాల పేరుతో జరుగుతున్న ఈ పోటీలకు పార్టిసిపేషన్ మెరిట్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వనున్నట్టు ప్రకటించారని పేర్కొన్నారు. అయితే, అఖిల భారత కబడ్డీ సంఘం మాత్రమే జాతీయ కబడ్డీ పోటీల క్యాలెండర్‌ను విడుదల చేస్తుందనే విషయాన్ని క్రీడాకారులు గమనించాలని సూచించారు. రాష్ట్ర కబడ్డీ సర్వసభ్య సమావేశంలో నిర్ణయించిన ప్రకారం, అంతర జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఏ జిల్లాలో, ఏ తేదీన నిర్వహించాలో తెలియజేస్తారని తెలిపారు. ప్రస్తుత అధ్యక్షుడు వెంకటరెడ్డి సంతకం లేకుండా ఇవ్వనున్న సర్టిఫికెట్లను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కూడా గుర్తించదని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, విశాఖ కబడ్డీ సంఘం పేరుతో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి ఈ నెల 15న గంగవరంలో జిల్లా స్థాయి జూనియర్ బాలురు, బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ప్రకటించినా, అవి కూడా గుర్తించరని హెచ్చరించారు. అఖిల భారత కబడ్డీ సంఘం జాతీయ పోటీల నిర్వహణ తేదీలను ప్రకటించిన తర్వాతే, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 51వ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని తెలిపారు. అందువల్ల గంగవరంలో జరగబోయే పోటీల్లో క్రీడాకారులు ఎవరూ పాల్గొనవద్దని ఆయన కోరారు.